# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...


News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com


సంపుటి : 3 | సంచిక : 302 | సోమవారం 16 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# మోగిన నగారా

**బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించిన భారత ఎన్నికల సంఘం**

**అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది**

**కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.**

**తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.**

**బంగాల్: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.**

**పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న**

*దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.*

# డైలమాకు తెర!

- ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్
- రైతు భరోసా డేట్ వచ్చేసింది
- ఈ నెల 22న రైతు నిధులు విడుదల
- సిద్దిపేట జిల్లా నుంచి విడుదల చేయనున్న సీఎం
- తొలి విడతగా ఒక ఎకరం వరకు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం



హైదరాబాద్

తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ నెల 22వ తేదీన రైతు భరోసా మొదటి విడత నిధుల విడుదల చేయనుంది. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నిధులు విడుదల చేయనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయనుంది కాంగ్రెస్ ప్రభుత్వం. అన్నదాతలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ నెల 22న రైతు భరోసా మొదటి విడత నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. సిద్ధిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. తొలి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు నిధులు విడుదల చేస్తారు. ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్ల నిధులు విడుదల చేయనున్నారు. రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్ల నిధులు, మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్లు విడుదల చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు - మిగతా3లో




## 'కేవైసీ అప్‌డేట్ చేయకపోతే
# కనెక్షన్ కట్

- తక్షణమే బుక్ చేసుకుంటేనే సిలిండర్'
- ఈ మెసేజ్‌తో తస్మాత్ జాగ్రత్త
- కేవైసీ అప్‌డేట్ చేయకపోతే గ్యాస్ కనెక్షన్ కట్ అని సందేశాలు
- ఫోన్లకు నకిలీ వెబ్‌సైట్ లింకుల్ని పంపుతున్న కేటుగాళ్లు
- సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ మోసాలు

హైదరాబాద్

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశంలో వంట గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దీన్ని సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సిలిండర్ల బుకింగ్ పేరుతో కొత్త - మిగతా3లో

## రాహుల్ గాంధీ భారత్‌ను,
# ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు



- బీజేపీని, ప్రధానిని వ్యతిరేకించే క్రమంలో, దేశాన్నీ రాహుల్ వ్యతిరేకిస్తున్నారు
- దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన
- ఏఐ సదస్సు వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశమా?



# కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ
- భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు
- తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారు



# విదేశాల్లో ఉన్న సొంత పౌరుల రక్షణలో భారత్ మేటి

- అంతర్జాతీయ మీడియా ప్రశంసలు
- తమ పౌరులనే కాకుండా, అత్యవసర సమయాల్లో విదేశీయులను సైతం సురక్షితంగా తరలించి భారత్ తన మానవతా దృక్పథాన్ని, అంతర్జాతీయ సంఘీభావాన్ని చాటుకుంటోంది
- వేగవంతమైన దౌత్యపరమైన చర్చలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం, సమర్థవంతమైన సైనిక లాజిస్టిక్స్‌తో వేలాది మంది భారతీయులను ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా స్వదేశానికి చేర్చగలిగింది

# నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- ఈ నెలాఖరు వరకు అసెంబ్లీ!
- రేపటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం
- సమావేశాల నిర్వహణపై అధికారులు, కార్యదర్శులతో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ సమావేశం



హైదరాబాద్

నేటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. నేడు ఉదయం 11:45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తారు. అనంతరం బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 20వ తేదీన శాసన సభలో, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాలు అత్యంత ముఖ్యమైనవని, ఎక్కువ రోజులు జరగడంతో పాటు ఎక్కువ సమయం పాటు - మిగతా3లో



# ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు మమత కీలక ప్రకటన

- పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనం పెంపు
- హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌లకు గుడ్ న్యూస్
- రూ.500 చొప్పున గౌరవ వేతనాన్ని పెంచిన దీదీ

# మోగిన నగారా

దేశంలో మళ్లీ ఎన్నికల హడావుడి మొదలుకానుంది. బంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి షెడ్యూల్ అనౌన్స్ చేశారు. తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల్లో మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అసోం: ఏప్రిల్ 9న పోలింగ్, కౌంటింగ్ మే 4న ఉంటుంది.
కేరళ: పోలింగ్ ఏప్రిల్ 9, కౌంటింగ్ మే4న.
తమిళనాడు: పోలింగ్ ఏప్రిల్ 23, కౌంటింగ్ మే 4న.
బంగాల్?: పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఉంటుంది. కౌంటింగ్ మే 4.
పుదుచ్చేరి: పోలింగ్ ఏప్రిల్ 9 , కౌంటింగ్ మే 4న.

పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=) ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు, డీజీపీలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్? కుమార్? తెలిపారు.



నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు.

నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఇలా!
మొత్తం ఓటర్ల సంఖ్య – 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు 824
పోలింగ్ స్టేషన్లు – 2.19లక్షలు
ఎన్నికల అధికారులు – 25 లక్షలు

"ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

**బైపోల్స్**

ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీ భారత్‌ను, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశాన్ని, దాని ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఇటీవలె దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సు వద్ద కాంగ్రెస్ యువజన విభాగం నేతలు చొక్కాలు లేకుండా నిరసనకు దిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాహుల్ క్షమాపణ చెప్పకపోగా, నిరసనకారులను పొగిడారు**

"భారతదేశాన్ని ఏఐ విభాగంలో బలోపేతం చేసే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సదస్సును దిల్లీలో నిర్వహించాం. కానీ కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లిపోయి, అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వాళ్లలాగే మేం కూడా రాజకీయాల్లో ఉన్నాం. గతంలో ప్రతిపక్షంగా పనిచేసిన అనుభవం సైతం మాకుంది. కానీ ఇలాంటి నిరసన కార్యక్రమాలను మేం నిర్వహించలేదు. ఏఐ సదస్సు అనేది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదు. యావత్ ప్రపంచం భారతదేశ ఏఐ టెక్నాలజీని, ఆవిష్కరణలను చూడటానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆ సదస్సుకు వచ్చింది. దేశానికి ముఖ్యమైన ఆ సదస్సు దగ్గర కాంగ్రెస్ యువజన విభాగం నేతలు అర్ధనగ్నంగా నిరసన తెలిపినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోగా, ఆ నిరసనలో పాల్గొన్నవాళ్లను ధైర్యవంతులని పొగిడారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ ఆ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఏ బాధ్యతాయుత రాజకీయ పార్టీ కూడా అలా వ్యవహరించదని నేను భావిస్తున్నాను" అని అమిత్‌షా పేర్కొన్నారు.



**సత్తా ఉంటే బీజేపీని ఢీకొనండి**

నిజంగా సత్తాయే ఉంటే నేరుగా ప్రజాక్షేత్రంలో బీజేపీని ఢీకొనాలని కాంగ్రెస్ పార్టీకి అమిత్‌షా సవాల్ విసిరారు. ఏఐ సదస్సు లాంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల వద్ద నిరసనలకు దిగుతూ భారతీయ యువతకు అవకాశాలను కాంగ్రెస్ తగ్గిస్తోందన్నారు. అనవసరమైన చోట్ల ప్రతాపాన్ని చూపిస్తున్న రాహుల్ గాంధీ, పార్లమెంటు నుంచి మాత్రం పారిపోతున్నారని కేంద్ర హోంమంత్రి విమర్శించారు. ఇలా చేస్తున్నందుకు భారత ప్రజలు రాహుల్‌ను క్షమించరన్నారు.

**ఆరోగ్య రంగంలో అసోం స్వయం సమృద్ధి**

"అసోంను ఆరోగ్య రంగంలో వికసిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం హిమంత బిస్వ శర్మ చాలా శ్రమిస్తున్నారు. ఆయన శ్రమ వల్లే ఇప్పుడు అసోం ఆరోగ్య రంగంలో స్వయం సమృద్ధిని సాధించింది. అసోం ప్రజలు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రం దాటి వెళ్లకుండా స్థానికంగానే వైద్య వసతులను కల్పించాలనేది తన లక్ష్యమని సీఎం హిమంత నాతో చెప్పారు. బంగాల్, ఈశాన్య రాష్ట్రాల పేద రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించే స్థాయికి అసోంను తీసుకెళ్లాలనే విజన్‌తో హిమంత ఉన్నారు. గతంలో అసోం ప్రజలు క్యాన్సర్ చికిత్స కోసం చెన్నై, ముంబయి, కర్ణాటక, దిల్లీలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఆ చికిత్సను పొందుతున్నారు" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు.

**అమిత్‌షా ప్రారంభించిన ప్రాజెక్టులు, పనులు ఇవే!**

గువహటిలో కొత్తగా నిర్మించిన ప్రాగ్‌జ్యోతిష్‌పూర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌ను అమిత్‌షా ఈసందర్భంగా ప్రారంభించారు.

గోలాఘాట్, తీన్ సుకియా క్యాన్సర్ సెంటర్లను హోంమంత్రి ప్రారంభించారు.

దిఫూ, జోర్హాట్, బార్పేటలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ నిర్మాణ పనులకు అమిత్‌షా వర్చువల్‌గా పునాది రాయి వేశారు.

గువహటిలోని సిక్స్ మైల్ ఏరియాలో స్వాస్థ్య భవన్, అభయపురి జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులకు కేంద్ర హోంమంత్రి పునాది రాయి వేశారు.

# ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు మమత కీలక ప్రకటన

బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటన చేయడానికి కొన్నిగంటల ముందు సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన చేశారు. హిందూ పురోహితులు, ముస్లిం ముఅజ్జిన్‌ల నెలవారీ గౌరవ వేతనాన్ని మరో రూ.500 చొప్పున పెంచుతున్నట్లు ఆమె వెల్లడించారు. దీని ప్రకారం ఇకపై బంగాల్‌లోని పురోహితులు, ముఅజ్జిన్‌లకు ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.2వేల గౌరవ వేతనం లభించనుంది. ఈమేరకు వివరాలతో ఎక్స్ వేదికగా సీఎం మమతా బెనర్జీ ట్వీట్ చేశారు. పురోహితులు, ముఅజ్జిన్‌ల గౌరవ వేతనాలను పెంచే ఆదేశాన్ని ఇచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని ఆమె వెల్లడించారు. ఈ సమాజపు ఆధ్యాత్మిక, సామాజిక జీవితాల కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు ఎన్నో సేవలు అందిస్తున్నారని మమత కొనియాడారు. గౌరవ వేతనం కోసం పురోహితులు, ముఅజ్జిన్‌లు కొత్తగా సమర్పించిన అన్ని దరఖాస్తులనూ ఆమోదించామన్నారు. మత సామరస్యం, సంప్రదాయ వ్యవస్థలకు మద్దతు అనేవి తమ ప్రభుత్వానికి అత్యంత కీలకమైన అంశాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతీ సామాజిక వర్గం, సంప్రదాయం వర్ధిల్లే అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సుసంపన్నమైన మన ఆధ్యాత్మిక వారసత్వానికి సంరక్షణకర్తలుగా వ్యవహరిస్తున్న పురోహితులు, ముఅజ్జిన్‌లు గౌరవ వేతనాలకు అర్హులని సీఎం మమత చెప్పారు.



**ఈనెల నుంచే ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ బకాయిలు**

"మాది మా – మాటీ – మనుష్ ప్రభుత్వం. మేం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. ప్రభుత్వ విద్యాసంస్థల లక్షలాది టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లోని ఎయిడెడ్ విద్యా సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన వాగ్దానాలను కూడా నిలబెట్టుకున్నాం. వాళ్లంతా ఆర్‌ఓపీఏ 2009 కరవు భత్యం (డీఏ) బకాయిలూ 2026 మార్చి నెల నుంచి అందుకుంటారు. రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు అందుతాయి" అని సీఎం మమత వెల్లడించారు.

**సుప్రీం కోర్టు ఆదేశాల ఎఫెక్ట్**

ఐదో వేతన సంఘం సిఫారసులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులు, ప్రయోజనాలలో సవరణలు చేసేందుకు రూపొందించిన మార్గదర్శకాలనే రివిజన్ ఆఫ్ పే అండ్ అలవెన్స్ (ఆర్‌ఓపీఏ) అంటారు. వీటిని అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బంగాల్‌కు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆర్‌ఓపీఏ మార్గదర్శకాల ప్రకారం 2008 ఏప్రిల్ 1 నుంచి 2019 డిసెంబరు 31 వరకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని కోరింది. ఉద్యోగ సంఘం వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, 2026 మార్చి 31లోగా 25 శాతం డీఏ బకాయిలను విడుదల చేయాలని బంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని 2025 మేలో ఆదేశించింది. మిగతా 75 శాతం డీఏ బకాయిలపై నిర్ణయాన్ని తీసుకోవడానికి నలుగురు రిటైర్డ్ జడ్జీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయమని బంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈనేపథ్యంలో డీఏ బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అందించాలని సీఎం మమత ఆదేశాలు జారీ చేశారు. ఈనెలలోనే వాళ్లందరికీ డీఏ బకాయిలు అందుతాయని వెల్లడించారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల వేళ ఉద్యోగులు, పెన్షనర్లను ప్రసన్నం చేసుకునేందుకే మమత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బంగాల్ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ ప్రకటన తర్వాత ఆదివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

## విదేశాల్లో ఉన్న సొంత పౌరుల రక్షణలో భారత్ మేటి



ప్రపంచంలోని ఏ మూలన సంక్షోభం తలెత్తినా, యుద్ధ మేఘాలు కమ్ముకున్నా... అక్కడ చిక్కుకుపోయిన తమ పౌరులను కాపాడుకోవడంలో భారత్ అత్యంత చురుగ్గా, వేగంగా స్పందించే దేశంగా ముందు వరుసలో నిలుస్తోందని ఓ తాజా నివేదిక ప్రశంసించింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత, సమన్వయంతో కూడిన భారీ తరలింపు చర్యలు ప్రపంచవ్యాప్తంగా దేశ కీర్తిని పెంచుతున్నాయని 'టైమ్స్ కువైట్' తన కథనంలో పేర్కొంది. కేవలం తమ పౌరులనే కాకుండా, అత్యవసర సమయాల్లో విదేశీ యులను సైతం సురక్షితంగా తరలించి భారత్ తన మానవతా దృక్పథాన్ని, అంతర్జాతీయ సంఘీభావాన్ని చాటుకుంటోందని ఆ నివేదిక కొనియాడింది. వేగవంతమైన దౌత్యపర మైన చర్చలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య అద్భుతమైన సమన్వయం, సమర్థవంతమైన సైనిక లాజిస్టిక్స్‌తో వేలాది మంది భారతీయులను ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా స్వదేశానికి చేర్చగలిగిందని వెల్లడించింది. ఇటీవలి కాలంలో చేపట్టిన ఆపరేషన్ రాహత్, ఆపరేషన్ సంకట్ మోచన్, ఆపరేషన్ గంగ, ఆపరేషన్ కావేరి వంటివి ఇందుకు నిదర్శనమని నివేదిక వివరించింది. 2025 మధ్యలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు' పేరుతో తమ పౌరులను సురక్షితంగా తరలించింది. సంక్షోభ ప్రాంతంలోని వారిని ముందుగా పొరుగున ఉన్న అర్మేనియాకు తరలించి, అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు. ఈ తరలింపు ప్రక్రియ చాలా సాఫీగా, చక్కటి ప్రణాళికతో జరిగిందని, ప్రయాణ ఏర్పాట్లు చేసేంత వరకు సౌకర్యవంతమైన వసతి కల్పించారని స్వదేశానికి తిరిగి వచ్చిన వారు తెలిపినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారత రాయబార కార్యాలయం అందించిన సహాయం చూసి తాను ఆశ్చర్యపోయానని కశ్మీర్‌కు చెందిన సెహ్రిష్ రఫీక్ చెప్పినట్లు టైమ్స్ కువైట్ ఉటంకించింది. 'మా కోసం రాయబార కార్యాలయం ఇంతలా శ్రమిస్తుందని నేను మొదట నమ్మలేకపోయాను. కశ్మీరీలు అందరూ భారత ప్రభుత్వానికి నిజంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు' అని ఆమె అన్నారు. ఈ ఆపరేషన్ ఎంతో సహాయకారిగా ఉందని, తమ భద్రతకు భరోసా ఇచ్చిన ఎంబసీకి పుల్వామాకు చెందిన మీర్ మహ్మద్ ముషారఫ్ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారత్ 'ఆపరేషన్ గంగ'ను ప్రారంభించి రికార్డు స్థాయిలో తరలింపు చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా 23,000 మందికి పైగా భారత పౌరులతో పాటు 18 దేశాలకు చెందిన 147 మంది విదేశీయులను కూడా సురక్షితంగా తరలించింది. పౌరులను మొదట పోలాండ్, రొమేనియా, హంగరీ, స్లోవేకియా, మోల్డోవా వంటి పొరుగు దేశాలకు చేర్చి, అక్కడి నుంచి ప్రత్యేక పౌర, సైనిక విమానాల్లో భారత్‌కు తీసుకొచ్చారు.

**అదే మా ప్రథమ ప్రాధాన్యత: భారత విదేశాంగ శాఖ**

"విదేశాల్లోని భారత పౌరుల భద్రత, శ్రేయస్సే మా ప్రథమ ప్రాధాన్యత. వారిపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలను మేము ఉపేక్షించలేము" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గతంలో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల సమయంలోనూ భారత ప్రభుత్వం అక్కడి పరిణామాలను నిశితంగా గమనిస్తూ, పౌరుల తరలింపునకు అన్ని మార్గాలను అన్వేషించింది. స్వదేశానికి తిరిగి రావాలనుకునే వారి కోసం విమాన ఛార్జీలను స్థిరంగా, అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంది. ఈ నిరంతర ప్రయత్నాలు, మానవతావాదంతో కూడిన స్పందన... బాధ్యతాయుతమైన ప్రపంచ శక్తిగా భారత్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు, బహుజన నేత కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానికి ఓ లేఖ రాశారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్ కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. వారి ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారని వివరించారు. ఆయన కృషి వల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఇటీవల లక్నోలో జరిగిన 'సామాజిక్ పరివర్తన్ దివస్' కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవమని, ఆయనను సాధికారతకు చిహ్నంగా భావించే కోట్లాది మంది ఆకాంక్షలను నెరవేర్చినట్టు అవుతుందని రాహుల్ తన లేఖను ముగించారు. అయితే, రాహుల్ డిమాండ్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి దళిత ఐకాన్‌ల గుర్తింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గత రికార్డును ఆమె ప్రశ్నించారు.

## విజయ్‌కు బీజేపీ భారీ ఆఫర్ డిప్యూటీ సీఎం పదవి, 80సీట్లు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో విజయ్? పార్టీ పొత్తు ఉంటుందనని గత కొన్ని రోజులుగా వార్తలొస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని టీవీకే పార్టీ స్పష్టం చేసింది. అయినా ఈ పొత్తు వార్తులు వస్తూనే ఉన్నాయి. తాజాగా విజయ్?కు బీజేపీ డిప్యూటీ సీఎం ఆఫర్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. పొత్తులో భాగంగా టీవీకేకు 80 సీట్లు ఇవ్వనున్నట్లుగా సమాచారం.

**తుదిదశలో బీజేపీ--టీవీకే చర్చలు**

తమిళనాడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ, టీవీకే మధ్య సీట్ల పంపకం చర్చలు తుదిదశకు చేరుకున్నాయని వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం కుదిరితే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక విజయ్ మాత్రం భవిష్యత్తులో ముఖ్యమంత్రి పదవిని లక్ష్యంగా పెట్టుకున్నారని సమాచారం. ఈ అంశం కూడా ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**విజయ్ అభిమాన ఓటు బ్యాంకుపై బీజేపీ దృష్టి**

ఎన్‌డీఏలోకి విజయ్ పార్టీని తీసుకురావడానికి బీజేపీ పలు మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం. విజయ్‌తో సంప్రదింపులు కొనసాగించేందుకు ఇతర రాష్ట్రానికి చెందిన ఒక డిప్యూటీ ముఖ్యమంత్రి కూడా మధ్యవర్తిగా పనిచేస్తున్నారని తెలుస్తోంది. తమిళనాడులో విజయ్?కు భారీగానే అభిమానులు ఉన్నాయి. ఇదే ఇప్పుడు బీజేపీకి కీలకంగా మారవచ్చని పార్టీ వ్యూహకర్తలు భావిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కేవలం 2 శాతం ఓట్ల మార్పు కూడా ఫలితాన్ని ప్రభావితం చేయగలదని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. అయితే ఎన్‌డీఏతో పొత్తుపై విజయ్‌కు దగ్గరగా ఉన్న కొందరు సలహాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. స్వతంత్ర రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రజల ముందుకు వచ్చిన కొత్త పార్టీగా టీవీకే తన ప్రతిష్ఠను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. ప్రారంభ దశలోనే జాతీయ కూటమిలో చేరితే పార్టీ ఇమేజ్ దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నట్లుగా సమాచారం.

# కేవైసీ అప్‌డేట్ చేయకపోతే కనెక్షన్ కట్

-మొదటిపేజీ తరువాయి

తరహా మోసాలకు తెరలేపారు. గ్యాస్ కొరత ఉందనే పుకార్లను నమ్మి, త్వరగా సిలిండర్ పొందాలని ప్రయత్నించే వారే వీరి ప్రధాన లక్ష్యం. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి కేటుగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

**అప్‌డేట్ చేయకపోతే కనెక్షన్ కట్**

అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ సరఫరా నిలిచిపోతుందని, తక్షణమే బుక్ చేసుకుంటేనే సిలిండర్ లభిస్తుందని నమ్మబలికే సందేశాలను వాట్సాప్, ఎస్?ఎంఎస్?ల ద్వారా సైబర్ నేరగాళ్లు పంపిస్తున్నారు. గ్యాస్ సబ్సిడీ ఆగిపోయిందని, మీ గ్యాస్ కనెక్షన్ కేవైసీ అప్‌డేట్ చేయకపోతే కట్ అవుతుందని అంటూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఈ సందేశాలతో పాటు పంపే నకిలీ వెబ్‌సైట్ లింకుల్ని నేరగాళ్లు ప్రధాన ఆయుధాలుగా మార్చుకుంటారు. తక్షణమే సిలిండర్ డెలివరీ, అదనపు సిలిండర్లు లభ్యం అంటూ సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇచ్చి అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు.

**మీ ఫోన్‌ను హ్యాక్ చేసి**

ఆన్‌లైన్‌లో ముందుగా డబ్బులు చెల్లిస్తేనే గ్యారెంటీగా గ్యాస్ సరఫరా చేస్తామని సైబర్ నేరగాళ్లు నమ్మబలుకుతారని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు తెలిపారు. ఒకసారి డబ్బు పంపిన తర్వాత వారు ఫోన్ లిఫ్ట్ చేయబోరని హెచ్చరిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీ కస్టమర్ కేర్ నెంబర్ల కోసం గూగుల్‌లో వెతికినప్పుడు వచ్చే నకిలీ నెంబర్లకు కాల్ చేస్తే, వారు మీ ఫోన్‌ను హ్యాక్ చేసే 'రిమోట్ యాక్సెస్' యాప్‌లను ఇన్‌స్టాల్ చేయిస్తారన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

"కొత్త నంబర్ల నుంచి మీకు గ్యాస్ బుక్ చేస్తాం, తక్కువ ధరతో, తక్కువ సమయంలో గ్యాస్ డెలివరీ అవుతుందని మెసేజ్ వస్తే వాటిలోని లింక్‌లను తెరవొద్దు. క్లిక్ చేస్తే ఏపీకే ఫైల్ మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అవుతుంది. రెగ్యులర్ డీలర్? నుంచి మాత్రమే గ్యాస్ తీసుకోవాలి. అనుమానం వస్తే గ్యాస్?




ఏజెన్సీలను, పోలీసులను సంప్రదించవచ్చు. ప్రస్తుత పరిస్థితులను నేరగాళ్లు వినియోగించుకునే అవకాశాలున్నాయి."

**అధికారిక ప్రకటనలను గమనించాలి**

సిలిండర్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లను లేదా అధీకృత ఏజెన్సీలను మాత్రమే సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని సూచిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం వల్ల మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారం నేరగాళ్ల చేతికి చిక్కుతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. యుద్ధం వల్ల గ్యాస్ కొరత ఏర్పడిందనే పుకార్లను నమ్మే ముందు అధికారిక ప్రకటనలను గమనించాలని పోలీసులు చెబుతున్నారు "మనకు వచ్చిన ప్రతి సమస్యను నేరగాళ్లు అవకాశంగా మలచుకుంటారు. వరదల సమయంలో వాతావరణం తెలుసుకొమ్మని, ట్రాఫిక్? సమాచారం అంటూ అనేక మోసాలు చేశారు. ప్రస్తుత పరిణామాలనూ వారికి అనుకూలంగా మలచుకుంటారు. కొత్త నంబర్ల నుంచి ఇలాంటి సందేశాలు వస్తే వాటి జోలికి వెళ్లొద్దు. లేదా సరిచూసుకున్నాకే కొత్తవాటిని నమ్మండి."

**సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్**

ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి లేదా ఎఎవతీఎతీఱఎవ.గ్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సైబర్ నేరాల్లో వెంటనే ఫిర్యాదు చేస్తే మీ డబ్బును రికవర్ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

## ఎప్‌సెట్ అనుకున్నంత ఈజీ కాదు

# ఆ విధానాన్ని నమ్ముకుంటే నష్టం తప్పదు

జేఈఈ మెయిన్‌కు సన్నద్ధమవుతున్నామని, అడ్వాన్స్‌డ్ రాయబోతున్నామని, ఎప్‌సెట్ (ఈఏపీసెట్)ది ఏముందిలే చాలా సులభమని ఎంతో మంది విద్యార్థులు భావిస్తుంటారని ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శిక్షణా సంస్థలు సైతం అలాంటి భావననే నూరిపోస్తుంటాయని, అలా అనుకుంటే ర్యాంకులో వెనకబడిపోవడం ఖాయమని అన్నారు. ఈ సంవత్సరం ఇంటర్? పూర్తి చేసుకున్న బైపీసీ, ఎంపీసీ స్టూడెంట్స్ ఇక నుంచి ఎక్కువ మంది జేఈఈ మెయిన్‌తో పాటు ఎప్‌సెట్‌పై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో ఎప్‌సెట్‌పై స్టూడెంట్స్?లో ఉన్న అభిప్రాయాల గురించి విజయ కుమార్ రెడ్డితో 'ఈటీవీ భారత్?' మాట్లాడింది. 100 శాతం మార్కులు రాకపోవడం గమనార్హం : జేఈఈ మెయిన్‌కు సన్నద్ధం అయితే ఎప్‌సెట్‌కు ప్రిపేర్ అయినట్లే అని అనుకుంటారని, అందులో వాస్తవం మెయిన్‌కు, ఎప్‌సెట్‌కు చాలా తేడా ఉందని విజయకుమార్‌రెడ్డి అన్నారు. మెయిన్‌లో 75 ప్రశ్నలే ఉంటాయని, ఎప్‌సెట్‌లో 160 ప్రశ్నలుంటాయని, సమయం మాత్రం ఒకటేనని గుర్తు చేశారు. జేఈఈ మెయిన్‌లో 100 శాతం మార్కులు వస్తుంటాయని, ఎప్‌సెట్‌లో మైనస్ మార్కులు లేకున్నా గత నాలుగు సంవత్సరాల్లో 100 శాతం మార్కులు రాకపోవడం గమనార్హమని తెలిపారు.

ఎప్‌సెట్‌లో టైంతో పోటీపడితే తప్ప అన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించలేరని, 160కి 40 తెచ్చుకుంటే అర్హత సాధించినట్లు అని, అయినా 20 నుంచి 25 శాతం మంది పాస్ కావడం లేదని పేర్కొన్నారు. అంతేకాదు 50 శాతం మార్కులు (80) దాటిన వారు చాలా తక్కువ ముంది ఉంటున్నారని అన్నారు. గత సంవత్సరం ఇంజినీరింగ్‌లో 2.07 లక్షల మంది పరీక్ష రాస్తే 2613 మంది (1.26 శాతం), అగ్రికల్చర్-ఫార్మసీలో



81 వేల మందిలో 2,726 మందికే(3.35 శాతం) 80 మార్కులు దాటాయని గుర్తు చేశారు.

సిలబస్ అనేక సంవత్సరాల నుంచి మారలేదు : 2022, 2023 సంవత్సరంలో ఇంజినీరింగ్ విభాగంలో ఉత్తీర్ణత శాతం వరుసగా 80.42, 80.34 శాతం ఉండగా 2024, 2025 సంవత్సరంలో అది 74.98, 73.26 శాతమే ఉందని, అంటే 7 శాతం తగ్గిందని ఎప్‌సెట్ కన్వీనర్ తెలిపారు. ఇంటర్ సిలబస్ అనేక సంవత్సరాల నుంచి మారలేదని, ప్రశ్నలు స్వల్ప సంఖ్యలో పునరావృతమైనా విమర్శలు వస్తాయని అన్నారు. విభిన్న రకాల ప్రశ్నలను అన్వేషించాల్సి వస్తోందని, అందుకే స్టూడెంట్స్? మరింత సాధన చేయాల్సిన అవసరముందని సూచించారు.

**ఆప్షన్లూ జంబ్లింగ్ చేశాం**

పరీక్షకు సన్నద్ధం కానివారు మైనస్ మార్కులు లేకపోవడం వల్ల ఏదో ఒక ఆప్షన్‌ను ఎంచుకుంటుంటారని తెలిపారు. ప్రశ్నలతో పాటు ఆప్షన్లూ జంబ్లింగ్ చేశామని, ఏ, బీ, సీ, డీల్లో ఏదో ఒకటి ఎంచుకుంటే 40 మార్కులు రావడం అన్న సంభావ్యత (ప్రాబబిలిటీ) చాలా తప్పని అన్నారు. ఆ విధానాన్ని నమ్ముకుంటే నష్టం తప్పదని హెచ్చరించారు.

తప్పులు లేకుండా ఇస్తున్నాం : ప్రశ్నలు తప్పుగా ఇస్తే వాటికి టైం వెచ్చించిన మెరిట్ స్టూడెంట్స్? నష్టపోతారని అన్నారు. ప్రశ్న తప్పు అయితే అందరికీ మార్కులు ఇవ్వాల్సి ఉంటుందని, అందువల్ల ప్రశ్నల నిధిలో నిక్షిప్తం చేసే ముందు 2, 3 మార్గాల ద్వారా పునః పరిశీలిస్తామని తెలిపారు. తాను కూడా వాటిని పూర్తిగా చదివిన తర్వాతే క్వశ్చన్ బ్యాంక్‌లో చేరుస్తామని, అందువల్లే తప్పులు లేకుండా ఇస్తున్నామని వివరించారు.

మొదట దరఖాస్తు చేసుకున్న వారికే కోరుకున్న జోన్ : ఉదాహరణకు ఆదిలాబాద్‌లో 140 నుంచి 160 మందే పరీక్ష రాయడానికి వీలు అవుతుందని, అలా కాకుండా మొత్తం దరఖాస్తులు తీసుకున్న తర్వాత ఇస్తే గందరగోళం తలెత్తుతుందని అన్నారు. ఒకవేళ ఆదిలాబాద్‌లో రాస్తామని 3 వేల మంది తొలి ఆప్షన్ ఇచ్చుకుంటే, అందులో ఎవరికి కేటాయించాలి? మేం ఆదిలాబాద్ అడిగితే వేరేది ఇచ్చారని మిగిలిన వారు ప్రశ్నిస్తారని చెప్పారు. అందువల్ల మొదట్లో దరఖాస్తు చేసుకున్న వారికి ఆ ప్రాంతంలో పరీక్ష రాసే అవకాశమిస్తామని తెలిపారు.ఖ

# 3 కార్పొరేషన్లకు విడివిడిగా ఎన్నికలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర పాలనలో కొత్త అధ్యాయం మొదలైంది. జీహెచ్‌ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పటికే అమలులోకి వచ్చింది. ముగ్గురు కమిషనర్ల నియామకం కూడా పూర్తి కావడంతో, ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల నిర్వహణపై పడింది. అయితే, మూడు కార్పొరేషన్లకు ఒకేసారి కాకుండా, ఒక్కో కార్పొరేషన్‌కు విడివిడిగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇలా చేయడానికి లోతైన రాజకీయ వ్యూహం ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఒక్కో మున్సిపల్ కార్పొరేషన్ లో వంద వార్డులు ఉన్నాయి. అయితే వాటిని మార్చాలనుకుంటున్నారు. వార్డుల సంఖ్యను పెంచడం ద్వారా ఏ ఒక్క రాజకీయ పార్టీకి ఏకపక్షంగా పట్టు చిక్కకుండా చేయాలన్నది సర్కార్ ఆలోచనగా చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలోని బలమైన ఓటు బ్యాంకులను ముక్కలు చేయడం ద్వారా రాజకీయ శక్తిని వికేంద్రీకరించాలని చూస్తోంది. ఈ వార్డుల పునర్విభజన ఫలితాలే రాబోయే రోజుల్లో కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల మేయర్ పీఠాలను ఎవరు అధిరోహించాలనేది నిర్ణయించేలా చేయాలనుకుంటున్నారు. మల్కాజ్‌గిరి వంటి కీలక ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇంకా పటిష్టమైన యంత్రాంగం సిద్ధం కాలేదు.




అక్కడ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికీ బలంగా ఉండటం అధికార పార్టీకి కొంత ఆందోళన కలిగిస్తోంది. ఒకేసారి ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగిలే ప్రమాదం ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అనుకూలమైన చోట ముందుగా, ప్రతికూలత ఉన్న చోట నిదానంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా నష్ట నివారణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి చోట్ల ఆంధ్ర మూలాలున్న ఓటర్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఈ ప్రాంతాల్లో గెలుపు ఏ పార్టీకైనా ప్రతిష్టాత్మకమే. అందుకే, తక్షణమే ఎన్నికలకు వెళ్లకుండా, అక్కడి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక అభివృద్ధి పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సైబరాబాద్ పరిధిలో మౌలిక వసతుల కల్పన ద్వారా వారి విశ్వాసాన్ని పొందాకే ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల వ్యూహంలో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి మూడు కార్పొరేషన్ల పరిధిలో 99 రోజుల ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణను ప్రకటించారు. ఈ స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆపై భారీ స్థాయిలో ప్రారంభోత్సవాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఒకవైపు పాలనను వికేంద్రీకరిస్తూనే, మరోవైపు అభివృద్ధి పనులతో ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టాలనేది ప్రభుత్వ ఎత్తుగడగా కనిపిస్తోంది.మూడు కార్పొరేషన్లకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరపడం ద్వారా.. ఒక ప్రాంతంలో వచ్చిన ఫలితం లేదా ప్రభావాన్ని మరో ప్రాంతంలో తమకు అనుకూలంగా మార్చుకోవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఇది ప్రతిపక్షాల ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు, అధికార యంత్రాంగాన్ని ఒకే చోట కేంద్రీకరించి గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడు తుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భాగ్యనగర త్రిశూల వ్యూహంతో మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. ఎంత మేర వర్కవుట్ అవుతాయన్నది వేచి చూడాల్సిందే.

## డైలమాకు తెర!

-మొదటిపేజీ తరువాయి

భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో రేవంత్ రెడ్డి చర్చించారు.

**రైతులకు పీఎం కిసాన్ నిధులు విడుదల**

దేశవ్యాప్తంగా అర్హులైన 9.3 కోట్లకు పైగా రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 22వ విడత నిధులను ఇటీవల విడుదల చేశారు పీఎం నరేంద్ర మోదీ. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా పంట సాయం కింద అర్హులైన లబ్ధిదారులకు కేంద్రం నిధులు విడుదల చేసింది. 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సంవత్సరానికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో పెట్టుబడి సాయం అందజేస్తోంది. తాజాగా వచ్చే ఖరీఫ్ కోసం తొలి విడత విడుదల చేయగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.

**డైలమాకు తెర..!**

గత యాసంగిలో రైతు భరోసా పెట్టుబడి సాయం ముందుగానే రైతుల ఖాతాల్లో ఎకరానికి 6 వేల చొప్పున జమ చేసిన విషయం తెలిసిందే. కానీ ప్రస్తుత యాసంగిలో రైతు భరోసా ఇంకా రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తమైంది. చెందుతున్నారు. ఈ యాసంగి రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుందో చేయదో అన్న ఆందోళనలో ఉన్న సమయంలో ప్రభుత్వం శుభవార్త చెప్పడంతో రైతుల డైలమాకు తెరపడింది.

ప్రస్తుత యాసంగి సీజన్ జిల్లా వ్యాప్తంగా 5,16,327 ఎకరాల్లో వరితో పాటు వివిధ పంటలు సాగయ్యాయి. వరి సుమారు 5 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. పెట్టుబడుల సమయంలో రైతుభరోసా అందక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. పొలాలు దున్నకం, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, వరి నాట్ల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకుని యాసంగి సాగును పూర్తి చేశారు. రైతు భరోసా వస్తుందనే ఆశతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. తాజాగా రైతు భరోసా నిధులపై ప్రభుత్వ ప్రకటనతో రైతులకు ఊరట లభించింది.

## నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

జరుగుతాయని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్?లు పేర్కొన్నారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సాఫీగా జరుగుతాయని వారు స్పష్టం చేశారు. అనుకోని సంఘటనలు, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వానికి, శాసనసభకు మంచి పేరు తీసుకువచ్చేలా పని చేయాలని అధికారులకు, శాసనసభ, మండలి కార్యదర్శులకు సూచించారు. సమావేశాలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర మూడో శాసనసభ ఎనిమిదో సమావేశాలు, తెలంగాణ శాసన మండలి 26వ సమావేశాల నేపథ్యంలో నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని కమిటీ హాల్?లో సన్నాహక సమావేశం నిర్వహించారు.

**ధర్నాలు, ఆందోళనలు జరగకుండా**

సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని శాసనసభ, మండలి కార్యదర్శులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు. ఆయా శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని స్పష్టం చేశారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని, సమావేశాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**తెలంగాణ పోలీసులకు మంచి పేరు ఉంది**

ఈసారి శాసన మండలి, అసెంబ్లీ సమావేశాలు ఒకే ప్రదేశంలో జరుగుతున్నాయని, అందువల్ల అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలని, అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. పెండింగ్?లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని తెలిపారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే సమర్థవంతమైనదని, మంచి పేరు ఉన్నదని కొనియాడారు. శాసన మండలి సమావేశాలు సజావుగా జరిగే విధంగా సహకరించాలని కోరారు.

**తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ**

ఈ సమావేశాల్లో ధర్నాలకు ఎక్కువగా పిలుపునిచ్చే అవకాశాలు ఉన్నాయని, చలో అసెంబ్లీ కార్యక్రమాలు జరగకుండా చూడాలని, సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొదటి రోజు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ జరుగుతుందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభలు సజావుగా జరగడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కో-ఆర్డినేషన్ కోసం ప్రతి శాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, స్పెషల్ ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## సారా కథ ఇంతింతకాదయా

మహబూబ్ నగర్

రాజకీయ నాయకులు సాధారణంగా ఓటర్లకు అభివృద్ధి మంత్రం వేస్తారు, కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాత్రం ఏకంగా ఆరోగ్య మంత్రం కనిపెట్టారు. అది కూడా ఎక్కడో విదేశాల్లో కాదు.. మన నాటు సారాలో! ఇప్ప పూవుతో కాచిన సారా తాగితే మనుషులు ఏకంగా 110 ఏళ్లు బతుకుతారని ఆయన సెలవిస్తున్నారు. ఆయన తీరు ప్రపంచ ఆరోగ్య సంస్థ తన హెల్త్ బులిటెన్లను మార్చుకోవాలేమో అన్న అనుమానం కలుగుతోంది. అనిరుధ్ రెడ్డి లాజిక్ ప్రకారం.. ప్రస్తుతం మనం వాడుతున్నవన్నీ కల్తీ వస్తువులే, కానీ ఇప్ప పూవుతో తయారు చేసే సారా మాత్రం స్వచ్ఛమైన ఆర్గానిక్ ప్రొడక్ట్ అట. సారా వల్ల ఆరోగ్యం చెడిపోతుందని నిషేధిస్తే.. ఎమ్మెల్యే గారు మాత్రం అది ఆయుష్షును పెంచే అమృతం అని సర్టిఫికేట్ ఇచ్చేస్తున్నారు. పైగా తాను స్టడీ చేశానని కూడా చెబుతున్నారు. సారా తాగితే ఆరోగ్యం.. 110 ఏళ్ల ఆయుష్షు ఖాయం అని ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఆయన చెబుతుంటే, నెటిజన్లు మాత్రం సెటైర్లతో విరుచుకుపడుతున్నారు. ఇన్నాళ్లూ ఈ డైట్ ప్లాన్ తెలియక కదా మేము ప్రోటీన్ షేక్స్, గ్రీన్ టీలు తాగి వేస్ట్ అయిపోయాం అని సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. అనిరుధ్ రెడ్డి కనిపెట్టిన ఈ లాంగ్ లైఫ్ సీక్రెట్ విన్నాక, మందుబాబులు కూడా మా ఎమ్మెల్యే గారు మా కోసం ఏదో ఒక కొత్త స్కీమ్ తెస్తారని తెలుసు.. కానీ ఇది మరీ అదిరిపోయింది అని మురిసిపోతున్నారు. అనిరుధ్ రెడ్డి తెలంగాణలో నిషేధించిన సారాను తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా మాట్లాడతానని అంటున్నారు. ఆయన మాటలు నమ్మి ఎవరైనా రేపటి నుంచి 'ఆర్గానిక్' పేరుతో సారా బాటిళ్లకు అతుక్కుపోతే, వారి జీవితం 110 ఏళ్ల దాకా వెళ్తుందో లేదో తెలియదు కానీ, వారి లివర్ మాత్రం త్వరగానే సెలవు తీసుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అనిరుధ్ రెడ్డి గారు తన సారా పురాణం తో కాంగ్రెస్ పార్టీలో కూడా సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. మరి ఈ ఆర్గానిక్ సారా ఫార్ములాను ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుందా? లేక ఎమ్మెల్యే గారి వ్యక్తిగత హెల్త్ టిప్‌గా మాత్రమే మిగిలిపోతుందా? అనేది చూడాలి.

# కాలువల్లేక కన్నీళ్లు..
# పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎవుసం ఆగమాగం**

**ప్రాజెక్టుల కింద పూర్తికాని కెనాళ్లు**

**'కాళేశ్వరం' 9, 10, 11, 12 ప్యాకేజీ పనులు పెండింగ్**

**ఆందోళనలో రైతులు**

**ఏటా యాసంగిలో ఎండుతున్న పంటలు**

**వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్**



**రాజన్న సిరిసిల్ల :** రైతులకు ఎన్నో ఆశలు రేకెత్తించి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు కాడి ఎత్తేసింది. సాగునీటి రంగాన్ని అడుగడుగునా పూర్తిగా విస్మరించి వారికి చుక్కలు చూపిస్తున్నది. రెండేండ్లుగా పంటలకు నీరందించే ఒక్క పనీ చేపట్టకుండా కన్నీళ్లు తెప్పిస్తున్నది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రాజెక్టుల పరిధిలో కాలువలు, ఉపకాలువలు, డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయకుండా చోద్యం చూస్తున్నది. దీంతో నీటి కటకట తీవ్రం కాగా, రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పంటను కాపాడుకునేందుకు పలువురు ట్యాంకర్ నీళ్లు పారిస్తుండగా, మరికొందరు పశువులకు మేతకు వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ప్రాజెక్టుల కింద కెనాళ్లు నిర్మించకపోవడం, పలుచోట్ల అసంపూర్తిగా వదిలేయడంతో పంటలకు నీరందించుకోలేని దుస్థితి ఉంది. కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి, గంగాధర మండలాల్లో కొరత తీవ్రంగా ఉంది. అలాగే, మెట్టప్రాంతమైన సిరిసిల్లలో పంటలు ఎండుతున్నాయి. ఒకప్పుడు కరువుతో అల్లాడిన ఈ ప్రాంతాన్ని గోదావరి జలాలతో అభిషేకించి పచ్చని మాగాణిగా మార్చేందుకు గత కేసీఆర్ సర్కార్ సంకల్పించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మధ్యమానేరు, మల్కపేట రిజర్వాయర్లను నిర్మించింది. వీటి కింద కొన్ని కాలువలు పూర్తయినప్పటికీ దిగువ ఆయకట్టుకు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పలు ప్యాకేజీల కింద ప్రధాన కాలువలు, ఉప కాలువలు, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాలు ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగానే ఉంటున్నాయి. ఫలితంగా యాసంగి పంటలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా రిజర్వాయర్లలో నీటిని ఇతర ప్రాంతాలకు విడుదల చేయడంతో చెరువులు, కుంటల్లో నీరు తగ్గి, భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు, బావులు ఎత్తిపోయి తిప్పలు పడుతున్నారు. రెండేండ్లుగా ప్రతి యాసంగిలో మెట్ట రైతులు పంట నష్టపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికి వచ్చే పంట ఎండిపోయి మూగ జీవాలకు మేతగా వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది. ప్రధానంగా సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల అర్బన్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, మండలాల్లో ఈ పరిస్థితి నెలకొన్నది.

**అన్నీ పెండింగే**

సిరిసిల్ల జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్ట్ 9, 10, 11, 12 ప్యాకేజీల కింద కాలువలు, ఉపకాలువలు, నిర్మించాల్సి ఉండగా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. భూ సేకరణతో పాటు పెండింగ్‌లో ఉన్న పరిహారం అందించి పనులు పూర్తి చేస్తే 1.39 లక్షల ఎకరాలకు సాగునీరందనుండగా, తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. కోనరావుపేట మండలం మల్కపేటలోని కాళేశ్వరం 9 ప్యాకేజీ పరిధిలో మల్కపేట రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల భూ సేకరణ అసంపూర్తిగానే ఉంది. ఈ ప్యాకేజీలో 70 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో కాలువల నిర్మాణం చేపట్టారు. భూ సేకరణ నిలిచిపోవడం, నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. ఇవి పూర్తయితే గొలుసు కట్టు చెరువులను నింపడంతో 15 వేల ఎకరాలకు నీరందుతుంది.తెలంగాణ వార్తలు

ఇల్లంతకుంట మండలంలోని కాళేశ్వరం 10వ ప్యాకేజీ ద్వారా కరీంనగర్, బెజ్జంకి మండలాలు కలిపి 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ కాలువలు నిర్మించాల్సి ఉండగా, పెండింగ్ పెట్టారు. సిద్ధిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ ప్రాజెక్ట్ నుంచి కాళేశ్వరం 11వ ప్యాకేజీ ద్వారా ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 32 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించాలి. ఇందులో 18 కిలోమీటర్లు నిర్మించాల్సిన ఎల్ఎం- 6, కాలువ సగానికిపైగా పూర్తయింది. సిద్ధిపేట జిల్లాలోని మల్లన్న సాగర్ ప్రాజెక్ట్‌లో 12వ ప్యాకేజీ కింద ముస్తాబాద్ మండలంలో 22 వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా ఉంది. దీని పరిధిలో ప్రధాన కాలువల భూ సేకరణ పూర్తి కాగా, పనులు పూర్తిస్థాయిలో జరగాల్సి ఉన్నది.

**మా గోస తీర్చాలె**

నేను ఆరెకరాల్లో వరి వేసిన. రెండేండ్ల నుంచి యాసంగిలో సాగు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నా. నాకు 17 గజాలు బావి ఉన్నా నీళ్లు అడుగంటిపోతున్నాయి. పంటకు సరిపోవడం లేదు. కాలువల నిర్మాణం పూర్తయితే మంచిగుండేది. చెరువులు నిండి బోర్లు, బావుల్లో నీళ్లు ఉండేటియి. గతంలో మిడ్ మానేరులో నీటిని నిల్వ చేయడంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండి ఇబ్బంది రాలేదు. కానీ ఇప్పుడు నీటిని ఇతర ప్రాంతాలకు పంపుతుండడంతో బోర్లు, బావులల్ల నీళ్లు తగ్గిపోతున్నయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మా గోస తీర్చాలె.

# సాగు నీటి కష్టాలతో సతమతం



ఆరుగాలం కష్టించి పనిచేసే అన్నదాతకు గడ్డు కాలం దాపురించింది. సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. రోజురోజుకు భూగర్భ జలాలు పడిపోతున్నాయి. విద్యుత్ కోతలు మామూలే. పొట్ట దశలో ఉన్న పొలాలకు నీళ్లు సరిపోవడంలేదు. ఫలితంగా అనేక చోట్ల పంట పొలాలు ఎండిపోతున్నాయి. గతంలో ఎండాకాలంలోనూ జలకళను సంతరించుకునేవి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. నీళ్లు లేక చెరువులు ఎండిపోతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 800 వరకు చెరువులు ఉన్నాయి. మూసీ పరీవాహక ప్రాంతాలైన భూదాన్ పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్, రామన్నపేట చెరువుల్లో పరిస్థితి బాగానే ఉందని అధికారులు చెబుతున్నారు. రోజురోజుకు నీటి నిల్వలు పడిపోతున్నాయి. ఫిబ్రవరిలో జిల్లా సగటు 6.49 మీటర్లుగా నమోదైంది. జనవరితో పోలిస్తే ఒక మీటరు కిందకు పడిపోయింది. నారాయణపురంలో అత్యధికంగా 10మీటర్ల లోతులో నీళ్లున్నాయి. ఆత్మకూరు (ఎం)లో 9.87, రామన్నపేటలో 8.58, బొమ్మలరామారంలో 8.58, తుర్కపల్లిలో 8.14, రాజాపేటలో 7.42, యాదగిరిగుట్టలో 7.19 మీటర్ల కింద నీళ్లు ఇంకిపోవడంతో నీటి మట్టం పడిపోయింది.

**కరెంట్ కోతలు మూమూలే..**

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న సర్కార్.. సరఫరాలో భారీ కోతలు విధిస్తున్నది. కనీసం 12 నుంచి 14 గంటలూ సరఫరా చేయడం లేదు. తెల్లవారు జామున 4 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే కరెంట్ అందుతున్నది. ఇందులో మధ్యలో కోతలు విధిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, స్టార్టర్లు కాలిపోతుండటంతో అదనపు భారం తప్పడంలేదు. జిల్లాలో అధిక శాతం మంది వరే సాగు చేశారు. అన్ని చోట్లా వరి పొట్ట దశకు వచ్చింది. ఈ సమయంలో సరిపడా నీరు అవసరం. చెరువులు ఎండిపోవడం, భూగర్భజలాలు ఇంకిపోవడం, బోర్లు వట్టిపోవడం, కరెంట్ కోతలతో నీరు దొరకడం కష్టమవుతున్నది. రాజాపేట, ఆత్మకూరు, రామన్నపేట, మోత్కూ రు తదితర మండలాల్లోని పొలాలు ఎండిపోయాయి. చేసేదేమీ లేక రైతులు పొలాల్లో బర్రెలు, గొర్రెలు మేపుతున్నారు.

**కాళేశ్వరం జలాలతో జీవం..**

ఇప్పుడున్న పరిస్థితుల్లో పలు మండలాలకు కాళేశ్వరం జలాలే జీవం పోయనున్నాయి. ఆ దిశగా కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకోవడంలేదు. కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి జిల్లాలోకి కాళేశ్వరం జలాలు వస్తాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే తుర్కపల్లి మండలంలోని చెరువులు కాళేశ్వరం జలాలతో కళకళలాడుతున్నాయి. గతంలో తుర్కపల్లి మండల నుంచి భువనగిరి మండలంతోపాటు, బీబీనగర్‌లోని పలు గ్రామాల్లోకి కాళేశ్వరం జలాలు వచ్చేవి. ఈ ఏడాది తుర్కపల్లి మండలంలోని పలు గ్రామాలకు మాత్రమే నెలపాటు గోదావరి జలాలు వదిలారు. ఇక్కడి నుంచి బొమ్మలరామారం మీదుగా బీబీనగర్, భువనగిరి మండలాల్లో ని పలు గ్రామాలకు నీటిని తరలించే అవకాశం ఉంది. బిక్కేరు వాగు పరీవాహకంలో నీటి కష్టాలు తప్పడంలేదు. గంధమల్ల రిజర్వాయర్ నుంచి కాళేశ్వరం జలాల విడుదలతో బిక్కేరు వాగు ప్రవహిస్తోంది. ఇది కొలనుపాక నుంచి మోత్కూరు మీదుగా అడ్డగూడూరు మండలానికి చేరుకుంటుంది. బిక్కేరు నుంచి జలాలను వదిలితే చెరువులు, చెక్ డ్యామ్‌లు జలకళను సంతరించుకుంటాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగి, బోర్లు పోసే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.

**ఎండుతున్న వరి పొలాలు**

గుండాల, మార్చి 14: మండలంలోని పలు గ్రామాల్లో పొట్టకొచ్చిన వరి చేలు నీరు లేక నెర్రెలుబారి ఎండిపోతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు లేక భూగర్భ జలాలు పడిపోవడంతో నీరందక వరి పంట ఎండిపోతున్నది. వరి పంట పాలు పోసుకునే దశలో నీరు అధికంగా అవసరం. బోర్లు, బావుల్లో నీరు లేకపోవడంతో రైతులు వరుస తడులపై పంటలకు నీరందిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వరుస తడులకు నీరందక పంటలను పూర్తిగా గొర్రెల మేతకు వదిలేస్తున్నారు. గుండాల మండలంలోని బిక్కేరు వాగు ప్రాంత రైతులు తమ పొలాలు కాపాడుకునేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వోల్టేజీతో పాటు మధ్యలో కరెంట్ ట్రిప్ అవడం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలోని నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి దేవాదుల కాల్వల ద్వారా గుండాల మండలానికి సాగునీరు అందిస్తే తప్ప పంటలను రక్షించుకునేందుకు వేరే మార్గం లేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4 దఫాలుగా సాగునీరు అందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూశారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నేటి ప్రభుత్వం సాగునీరు అందిస్తామని చెప్పడమే తప్ప విడుదల చేయడం లేదని వాపోతున్నారు. నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా సాగునీటిని పూర్తి స్థాయిలో విడుదల చేస్తే మండలంలోని చెరువులు, కుంటలు నిండి సాగుకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందంటున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టకపోవడంతో జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి ప్రాంతాలకు అక్కడి ప్రజాప్రతినిధులు నీటిని వాటాకు మించి తరలించుకు పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసి గుండాల మండలానికి సాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. తుర్కలశాపూరం గ్రామంలో కమ్మంపాటి సోమ సాయిలుకు చెందిన వరి చేలో శుక్రవారం గొర్రెలను మేతకు వదిలారు. సోమసాయిలు తన 2.5 ఎకరాల పొలంలో వరి సాగు చేశాడు. ఇటీవల భూగర్భ జలాలు పడిపోవడం, ఎండల తీవ్రత పెరగడంతో 2.5 ఎకరాలచేనుకు నీరందక పోవడంతో వరి చేనును గొర్రెలకు మేతగా వదిలేశాడు. నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా గుండాల మండలానికి సాగునీటిని విడుదల చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**బుద్దారంలో ఎండుతున్న పొలాలు**

నల్లగొండ రూరల్,మార్చి 14 : నల్లగొండ మండలంలోని బుద్ధారం గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో పలువురి రైతుల పంటలు పొట్ట దశలో ఎండిపోయే పరిస్థితి నెలకొంది. భూగర్భ జాలలు అడుగంటి, గత పది రోజులుగా బోర్లు ఎండిపోవడంతో రైతులు పొలాలను కాపాకునేందుకు ట్యాంకర్ల సాయంతో నీరందిస్తున్నారు. బుద్ధారం గ్రామానికి చెందిన రైతు తుమ్మల లింగస్వామి తన ఎకరంన్నర పొలంలో వరి నాటు పెట్టాడు. ప్రస్తుతం పొట్ట దశకు చేరుకునే సమయంలో బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్‌తో నీరందిస్తున్నాడు.

అదే విధంగా రైతులు చిలుకల పరమేష్, ఉదయ్ సైతం 10 ట్యాంకర్ల నీటిని తమ పొలాలకు పోశారు. ప్రభుత్వం బ్రాహ్మణ వెల్లెంల ద్వారా చెరువులు నింపుతున్నామని చెబుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో కాల్వ నిర్మాణాలు చేపట్టకపోడంతో భూగర్భ జాలలు అడుగంటి, బోర్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. మరో 10 రోజుల్లో బుద్ధారంలో 100 ఎకరాల్లో పూర్తిగా పంటలు ఎండిపోయే ప్రమాద ఉందని వారు పేర్కొన్నారు.

బుద్దారంలో ఎండుతున్న పొలాలు

నల్లగొండ మండలంలోని బుద్ధారం గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో పలువురి రైతుల పంటలు పొట్ట దశలో ఎండిపోయే పరిస్థితి నెలకొంది. భూగర్భ జాలలు అడుగంటి, గత పది రోజులుగా బోర్లు ఎండిపోవడంతో రైతులు పొలాలను కాపాకునేందుకు ట్యాంకర్ల సాయంతో నీరందిస్తున్నారు. బుద్ధారం గ్రామానికి చెందిన రైతు తుమ్మల లింగస్వామి తన ఎకరంన్నర పొలంలో వరి నాటు పెట్టాడు. ప్రస్తుతం పొట్ట దశకు చేరుకునే సమయంలో బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్‌తో నీరందిస్తున్నాడు. అదే విధంగా రైతులు చిలుకల పరమేష్, ఉదయ్ సైతం 10 ట్యాంకర్ల నీటిని తమ పొలాలకు పోశారు. ప్రభుత్వం బ్రాహ్మణ వెల్లెంల ద్వారా చెరువులు నింపుతున్నామని చెబుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో కాల్వ నిర్మాణాలు చేపట్టకపోడంతో భూగర్భ జాలలు అడుగంటి, బోర్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. మరో 10 రోజుల్లో బుద్ధారంలో 100 ఎకరాల్లో పూర్తిగా పంటలు ఎండిపోయే ప్రమాద ఉందని వారు పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : డీపీవో



**తాండూర్ :** పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డీ వెంకటేశ్వర్ రావు అన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఆదివారం మండలంలోని పలు గ్రామపంచాయతీలలో ఘనంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. బోయపల్లి గ్రామపంచాయతీలో జరిగిన కార్యక్రమంలో డీపీవో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా పరిశుభ్రత కోసం నిరంతరం కష్టపడి పనిచేసే కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలోని అన్ని మురికి నీటి కాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రై వేస్ట్ ఎక్కడా కనిపించకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పీపీఈ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జి అనిల్ కుమార్, సర్పంచ్ సుందిల్ల శంకరమ్మ, ఉప సర్పంచ్ నల్లల మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం: బాల్క సుమన్




మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్–సీపీఐ కూటమి గెలుచుకుందని పేర్కొన్నారు. మెజారిటీ స్థానాలు గెలుచుకున్నప్పటికీ చైర్‌పర్సన్ ఎన్ని జరకుండా కాంగ్రెస్ కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసు నేపథ్యంలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు ఇవాళ బాల్క సుమన్ హాజరయ్యారు. అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ.. ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా దౌర్జన్యంగా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. గత నెల 16, 17వ తేదీల్లో చైర్‌పర్సన్ ఎన్నిక జరకుండా వివేక్ అడ్డుకున్నారని తెలిపారు. తనతో సహా 25 మంది బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. రెండేళ్లలో సింగరేణి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని విమర్శించారు. మందమర్రి ఏరియాలో కాసిపేట 2 ఇంక్లైన్ బొగ్గు గని తెచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే అని బాల్క సుమన్ తెలిపారు. సింగరేణి ఏరియాలో మూడు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. మంత్రి వివేక్‌కు ఈ ప్రాంతంపై ప్రేమ ఉంటే కొత్త భూగర్భ గనులు తీసుకురావాలని సూచించారు. హైకోర్టు తీర్పు ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నికను అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని కోరారు.

## బీఆర్ఎస్‌లో చేరిన వార్డు సభ్యులు.. స్వాగతం పలికిన ఎమ్మెల్యే



**రెబ్బెన :** మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గోలేటి గ్రామ సర్పంచ్ ఆజ్మీర బాబూరావు ఆధ్వర్యంలో వార్డు సభ్యులు జుమ్మిడి అరుణ్, మిడిగొండ లక్ష్మి లింగమూర్తి ఆదివారం ఎమ్మెల్యే కోవలక్ష్మి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎ స్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, బీఆర్ఎస్ రెబ్బెన మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, గుండి సర్పంచ్ జబరి రవీందర్, రాజంపేట ఉపసర్పంచ్ మామిడి లక్ష్మి, మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, నాయకులు నిసార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలు తగ్గించాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళల నిరసన

**తుంగతుర్తి :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్ ధరలను ( +ుం ాతీఅఙవం ) తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. నిత్యావసరాల ధరలను అదుపులోకి తెచ్చి పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు జటంగి రవి, మండల నాయకులు మల్యాల రాములు, మాజీఎంపీటీసీ ఇలైజర్, మాజీ సర్పంచ్ జటంగి మల్లమ్మ, మల్లయ్య, శ్రావణ్, సామెల్, విజయ్, వెంకన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com